

# విధాయకం

ఎం. కామేశ్వర రావు

సుదర్శనం ఇంటికి వచ్చాడు. చెప్పులు తలుపు పక్కగా విడిచి, బట్టలు మార్చుకున్నాడు కుళాయి దగ్గిర కాళ్లూ - చేతులు కడుక్కుని, తలుపుమీద వేసిన తుండుతీసి మొహం తుడుచుకుంటూ వుండగా సీత వచ్చింది. "చాలా పొద్దు పోయిందేం? మధ్యాహ్నం ఉప్మాచేశాను. ఆరున్నరదాకా చూశాను - మీరు రాలేదు. మరి వచ్చినా తినరని లచ్చి కిచ్చి పంపించాను.

"మంచిపని చేశావ్," కుర్చీలో అలసటగా కూర్చుని, కాళ్లు జాపుకున్నాడు సుదర్శనం.

"ఈపూట మరీ యింత ఆలస్యం ఎందుకయింది?"

"చిన్నప్పటి స్నేహితుడు కనిపించాడు. పార్క్‌లో ఈ వేళ దాకా కూర్చుని కబుర్లు చెప్పుకున్నాం."

"పోనీ యింటికి తీసుకురాలేకపోయారా"

"వేరే ఏదో పని వుందిట - రానన్నాడు"

నిట్టూర్చింది సీత. "వడ్డించేయు మంటారా?"

సుదర్శనం కళ్లు మూసుకుని కాస్సేపు కణతలు నొక్కుకున్నాడు. "టైం ఎంతయింది?"

"ఎనిమిదికి పదినిముషాలుంది!" వంగి ముందుగదిలో రేడియోమీదున్న అలారం పీసు లోకి చూసింది సీత.

"వడ్డించేయ్"

సీత వంటింట్లోకి వెళ్లిపోయింది.

పీట వాల్చి కంచం పెట్టిన చప్పుడు.

"వడ్డించాను" వంటింట్లోంచి పిలుపు వచ్చింది.

పిలుపు వచ్చిన రెండు నిముషాలకు లేచి వెళ్ళి వాల్చిన పీటమీద కూర్చున్నాడు సుదర్శనం. ఏదో ఆలోచిస్తూ అన్నం కలుపుతున్నాడు.

అతడు కలుపుకున్న అన్నంమీద నెయ్యి వేస్తూ, "ఈ సంగతి తెలుసా ?" యథాలాపంగా అడిగింది సీత.

"ఏ సంగతి ?" ఆ "సంగతి" అంటే ఆసక్తి లేనట్టుగా పొడిగా అడిగాడు సుదర్శనం.

"రాజారాం సంగతి !"

"ఏమయింది రాజారాంకి ?"

"ఇంకా ఎక్కడి రాజారాం ?"

ఉలిక్కిపడ్డాడు సుదర్శనం. నోటిదగ్గర పెట్టుకోబోతున్న ముద్ద జారి, కంచంలో పడిపోయింది. "ఏమంటున్నావ్, నువ్వు ?" నమ్మలేనట్టుగా అడిగాడు.

"అవును - రాజారాం పోయాడు. మధ్యాహ్నం మూడు గంటలకి అనుకుంటా !"

సుదర్శనం ఆవార్త నమ్మలేకపోతున్నాడు. ఇదేమిటి, రాజారాం పోయాడంటుందేమిటి? మనిషికి ఒకరోగంలేదు రొష్టులేదు. నిండా నలభై ఏళ్లుకూడా లేవు. "ఎలా పోయాడు?" ఎలాగో గొంతు పెగుల్చుకున్నాడు.

"నిద్రమాత్రలు మింగి, జీతం అంతా అదేదో జూదంలో పెట్టాడట! అంతా పోయింది. తెల్లారితే భార్యా బిడ్డలకి, అప్పులాళ్లకి మొహం చూపించలేక రాత్రికి రాత్రే నిద్ర మాత్రలు మింగేశాడు. పగలు పిళ్లు నెత్తీనోరు బాదుకుని, ఆస్పత్రికి

పట్టుకు పరిగెత్తారు. డాక్టర్లు చాలా ప్రయత్నాలు చేశారు — లాభంలేక పోయింది. నేను మధ్యాన్నం టిఫిన్‌చేసి, స్టౌ ఆర్పబోతూంటే కమల వచ్చి చెప్పింది. నేనూ వెళ్ళి చూసి వచ్చాను. పాపం ఆవిణ్ణి చూస్తూ వుంటే కడుపు తరుక్కుపోతోంది. ఆ బుడతల్లాంటి ఆరుగురు పిల్లలతో ఇకపై ఎలా నెగ్గుకొస్తుందో? పెద్ద కుర్రాడికి పదహారేళ్ళు వచ్చినా, చదువబ్బలేదు కదా! పిల్లల్నీ, కట్టుకున్న పెళ్ళాన్నీ వాళ్ళ ఖర్మాన వాళ్ళని వదిలేసి తనదారి తాను చూసుకున్నాడు రాజారాం. నిజంగా చాలా తెలివి తక్కువపని చేశాడు" ఆవేశంగా ఏదో ఏదో చెప్పుకు పోతోంది సీత.

సుదర్శనానికి ఆమాటలేమీ వినిపించడం లేదు.

రెండు రోజుల క్రితం తనతోపాటు పార్కుకివచ్చి, రెండు గంటల సేపు మాట్లాడిన రాజారాం ఈరోజు లేడంటే ఏదోలా వుంది. పదేపదే ఆరోజు సాయంత్రమే అతని కళ్ళముందు తిరుగుతోంది.

ఆ రోజు సాయంత్రం అతను ఆఫీసు నుంచి వచ్చి, టిఫిన్ అదీచేసి, మళ్ళీ బట్టలు వేసుకుని వీధిలోకి వచ్చాడు. రోజూ సాయంత్రం వీలయినప్పుడల్లా అలా పార్కుదాకా నడిచి వెళ్ళడం సుదర్శనానికి అలవాటు.

వీధి మొదట్లోనే ఉంది రాజారాం ఇల్లు! కిటికీలోంచి రాజారాం సుదర్శనాన్ని చూసి పలకరింపుగా నవ్వాడు "ఉండండి మాష్టారు! నేనూ వస్తాను, మీతో కొంచెం పని వుంది— మాట్లాడాలి!" చెయ్యూపి, చెప్పులు తొడుక్కుని ఇవతలకి వచ్చాడు

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

సుదర్శనం ఆలోచిస్తున్నాడు. రాజారాంకి తనతో ఏం పనా అని కాదు. అతనికి ఏం జవాబు చెప్పాలో అని ఆలోచిస్తున్నాడు. రాజారాంకి తనతో ప్రత్యేకంగా ఉండే 'పని' ఏమిటో ఆతనికి తెలుసు రాజారాంకి కావలసింది 'డబ్బు' అతనికి అన్ని పనులూ ఆ రెండక్షరాల మాటలోనే. అయితే అప్పులివ్వడం, మళ్ళీ వాళ్ల వెంట తీర్చమంటూ తిరగడం అంటే సుదర్శనానికి మహా చిరాకు. అదీ రాజారాంకి ఇవ్వడం అంటే అతనికి అసలే ఇష్టం వుండదు రాజారాంకి అప్పిస్తే తిరిగి రావడం చాలా కష్టం! పాపం రాజారాంకిమాత్రం వెంట వెంటనే అప్పులు తీర్చేసి, తేలిగ్గా వూపిరి పీల్చుకోవాలనే వుంటుంది. కానీ ఆ అప్పులనే ఊబిలోంచి బయట పడలేని దుర్బలుడు అది అతని తప్పు కాదు. ఆ ఇంటి పరిస్థితులు, అటువంటివి ఒక పెళ్ళికు పెళ్ళవగా మిగిలింది ఆరుగురు సంతానం కటింగులు పోగా చేతికొచ్చేది రెండొందల జీతం. ఈ రెంటిమధ్యా సమన్వయం కుదరడం చాలా కష్టం.


ఇక ఆ మౌనం భరించ లేనట్లుగా రాజారాం గొంతు సవరించు కున్నాడు. "మాష్టారు, రేపు మీరు జీతం అందుకోగానే రెండువందలు సర్దగలరా?"

సుదర్శనం వెంటనే, "అయ్యో, మీరా విషయం నాలుగు రోజుల ముందే చెబితే బావుండేది. మొన్ననే మా అక్కయ్యకి వరలక్ష్మి వ్రతం కదా రెండొందలు పంపుతాను, మంచి చీర కొనుక్కో అని ఉత్తరం వ్రాశాను" అని చాలా అవలీలగా అబద్ధం ఆడేశాడు

రాజారాం మొహం నయాపైసా అంత ఏమీ మారలేదు. ఇటువంటివన్నీ అతడికి షరా మామూలులే!

పార్కులో ఇద్దరూ ఓ విరిగిన బెంచీమీద కూర్చున్నారు "ఎల్లుండి మీకుకూడా జీతం వస్తుంది కదా, నెల మొదట్లో అప్పు చెయ్యడం ఎందుకు?"

రాజారాం వేదాంతిలా నవ్వాడు "పాత అప్పు తీర్చడానికి" అని ఓ క్షణం ఆగాడు ఆ తరువాత, "నేనో పెద్ద తప్పు చేశానండీ మాష్టారూ!" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.




అలాగా అన్నట్టుగా బుర్రాడించాడు సుదర్శనం.

"మా పెద్దమ్మాయికి పెళ్ళి చేశాను."

ఈసారి సుదర్శనానికి కొంచెం ఆశ్చర్యం వేసింది.

"అవునండీ, మా అమ్మాయికి పెళ్ళి చేయడం తప్పే! పెళ్ళి పెటాకులు లేకపోతే అదీ మాతోపాటే తింటూనో, తినకనో పడి వుండేది— ఇప్పుడు దానిది మరో ఇల్లు. ఆ ఇంట్లో వాళ్ళందరూ దాని మనుషులు పెళ్ళయి మూడేళ్ళు కావస్తోంది—ఇంకా అది పెట్టలేదు, ఇది పెట్టలేదంటూ సాధింపులు, అత్తగారు అడుగుతున్నారని, ఆడపడుచులు ఆడిపోసుకుంటున్నారని, భర్త భయపెడుతున్నాడని ఉత్తరాలు. ఇక్కడేమైనా రాశి పోసుకూర్చున్నాం అనుకుంటోందేమో! భర్త డబ్బు లేదన్నాడట. వరలక్ష్మి వ్రతానికి చీర కొనుక్కోడానికి డబ్బు పంపమని వ్రాసింది. ఆఖరాడు డబుల్ టైఫాయిడ్‌తో యింకా కోలుకోలేదు. ఓ పచ్చనోటు పూర్తిగా మింగేసినా ఆ జబ్బు వాణ్ణి ఇంకా విడిచిపెట్టనంటోంది. మా అమ్మ ఈమధ్యే పోయిందిగా, ఆ తాలూకు ఖర్చులు నాలుగొందల్లో నా వాటా రెండొందలూ వెంటనే టి. ఎమ్. ఓ. చేయమని మా అన్నయ్య వారానికి రెండుత్తరాలు వ్రాస్తున్నాడు. పాత అప్పులు ఐదొందలూ యింకా తీర్చనేలేదు. ఇంకా చెప్పాలంటే ఎన్నో వున్నాయి." నవ్వుతూ చెబుతున్నా రాజారాం కళ్ళల్లో లీలగా తడి మెరిసింది

ఏదో నలక పడినట్టుగా కళ్ళు తుడుచుకుని, "పోనీలెండి. సాయంత్రం మీరేదో ప్రశాంతంగా గడపడానికొస్తే నా గోలతో మిమ్మల్ని బోరెత్తించడం దేనికిలెండి మాష్టారు? ఈ మధ్య మీ కథలేం అచ్చయ్యాయో చెప్పండి" అంటూ తనే టాపిక్ మార్చాడు రాజారాం

తనకన్నా పదేళ్ళు వయసులో పెద్దయినా అతను తనని "మాష్టారు" అంటూ మన్నించడం సుదర్శనానికి వింతగా తోచేది. "నాకు అందర్నీ, అంటే మర్యాద యివ్వతగ్గ వాళ్ళనీ లెండి, అలాగే పిలవడం అలవాటు మాష్టారూ!" అన్నాడు రాజారాం ఓ సారి అతను దాన్ని గురించే అడిగినప్పుడు.

40 సం॥ అనుభవం
వరి బీజము బుడ్డలు బీజకుట్లు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును
వివరములకు
రే అండ్ కో రిజిస్టర్డు ఆసుపత్రి
గౌలిగూడ నయ బస్ డిపో ఎదుట,
బాలాజీలాడ్జింగ్ ప్రక్కన, హైద్రాబాద్-12.
ఆఫీస్‌ఫోన్ 42870, ఇంటిఫోన్:38544

నిరుద్యోగులకు, పారిశ్రామికులకు
వ్యాపార సంస్థలకు అత్యంత అవుసరం
అంబడిపూడి
స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్
పెట్టుబడిలేకుండా కొద్ది పెట్టుబడితో
ఉద్యోగంకంటే ఎక్కువగా డబ్బు సంపాదించ
గల 200 పథకాలూ, సబ్బు, పెయింట్లు వార్నిష్
లవంటి ప్రజలకవసరమైన అనేక వస్తువులు
ఇంటిలోనే స్వయంగా తయారుచేసే విధానాలు
వీటికి కావలసిన ముడిసరుకులు యంత్రాలు,
దొరికే చోట్లు రహస్యాలు, తెలిపే లేబరేటరీలు,
మొత్తం దేశంలోని సంస్థల చిరునామాలువున్న
పుస్తకం.
12 రూపాయలు పంపితే రిజిష్టర్డు పోస్టులో పంపుతాం
VP పద్ధతి లేదు
జలజ ప్రచురణలు విజయవాడ 3



OBM—4493A TEL

# విధాయకం

ఇద్దరూ చీకటి పడేదాక కథల విషయాలే చర్చించు కున్నారు. "మీరిలా మామూలు కథలే కాదు, ఈసారి పోటీకి కూడా కథ వ్రాసి పంపండి. చూశానుగా మీ శైలే చాలా బావుంటుంది" అంటూ చీకటి పడటం గమనించి లేచి నిలబడ్డాడు రాజారాం.

ఇద్దరూ తిరిగి వస్తున్నప్పుడు దూరంగా ట్యూబ్ లైట్ల కాంతిలో ధగ ధగ మెరిసి పోతూన్న స్కిల్ గేమ్స్ ఆవరణ వైపు వేలు పెట్టి చూపించి "వాటిని నడవడానికి ఎలా ఒప్పుకుంటుందండీ ఈ ప్రభుత్వం ?" అని అడిగాడు రాజారాం.

సుదర్శనం నవ్వాడు. "ఇది ప్రజారాజ్యం అనే సంగతి కొంపదీసి మీరు మర్చిపోయా రేమిటి! మనం ఒప్పుకుంటున్నాం కాబట్టి అవి నడవ గలుగుతున్నాయ్!"

రాజారాం మరి మాట్లాడక, ఇల్లు రాగానే సుదర్శనం దగ్గిర సెలవు తీసు కున్నాడు.

"ఏవిటో, అన్నం తినకుండా ఏదో ఆలో చిస్తూ కూర్చున్నారు. మీరు తొందరగా తినేస్తే, నేనూ తిని ఈ వంటిల్లూ అది కడుక్కుని బయట పడతాను. అసలే ఆయా సంగా ఉందీ పూట!" సీత మాటలతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు సుదర్శనం.

కంచంలో వడ్డించిన అన్నం వడ్డించినట్లే ఉంది. వేళ్లు అతని ప్రమేయం లేకుండానే కంచంలో అన్నాన్ని కెలుకుతున్నాయి. సుదర్శ నానికి మరేమీ తినాలనిపించలేదు. "నాకు ఆకలిగా లేదు. నువ్వు తినేయ్! పిచ్చి పిచ్చిగా ఆలోచించి. ఆవేశ పడకు. అసలే ఒట్టి మనిషివి కూడా కావు" రాజారాం విషయంలో భార్యను హెచ్చరించి పీట మీది నుంచి లేచి పోయాడు.

అయితే తన గదిలోకి వచ్చి, కుర్చీ మీద కూర్చున్నా రాజారాం గురించిన పిచ్చి ఆలోచ నలు అతణ్ని విడిచిపెట్టలేదు. ఎంత పని చేశాడు రాజారాం. తను ఆ రోజు అడిగినప్పుడే డబ్బిస్తానని అని వుంటే ఈ ఘోరం జరిగి ఉండేదా ? ఎక్కువ డబ్బు సంపాదించ వచ్చనే కదా రాజారాం డబ్బంతా స్కిల్ గేమ్స్‌లో తగలేశాడు. ఆ డబ్బు తనే సర్దుతానంటే అతను ఆ ఛాయలకు కూడా వెళ్లేవాడుకాదు. డబ్బు ఎంత పని చేయిస్తుంది. ఎంత నిగ్రహా పరుణ్ణయినా బలహీనుడిగా అతి దుర్బల హృదయుడిగా క్షణాల్లో మార్చేస్తుంది

ఒక మనిషి మరణించడానికి పరోక్షంగా తను కారకుడనే చేదు నిజాన్ని సుదర్శనం భరించలేకపోతున్నాడు.

అతడు అశాంతిగా రెండు చేతులతో తలకాయి పట్టుక్కూర్చున్నాడు, సీత గదిలోకి వచ్చేదాకా !

* * *

"టెలిగ్రాం అనే పోస్ట్ బంట్రోతు కేకకి వంటింట్లో ఉన్న సుదర్శనం కంగారుగా వీధిలోకి వచ్చాడు.

సంతకం పెడుతూండగా చేతులు వణికాయి.

ఇప్పుడు టెలిగ్రాం ఎందుకు వచ్చినట్లు? ఎక్కడినుంచి వచ్చినట్లు ? సీత క్షేమంగా చేరినట్లు వారం క్రితమే ఉత్తరం వచ్చింది. జవాబుకూడా వ్రాశాడు, ఒకవేళ అనుకో కుండా డెలివరీ అయిందేమో ! సీత కెలా వుందో ? పిల్లో పిల్లాడో ? సుదర్శనం ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

పోస్ట్‌మాన్ చేతిలో పెట్టి వెళ్లిన ఆ గులాబీరంగు కాగితం సౌరభాలనే వెదజల్లు తుందో ముల్లులా కలుక్కు మనిపిస్తుందో ? చిట్టచివరికి దాన్ని చించి చదివాడు.

క్షణం నోటివెంట మాటరాలేదు.

అందులో సారాంశం 'మీ "అడ్డదారి" కథకి పోటీలో రెండవ బహుమతి వచ్చింది'

సుదర్శనం ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. మామూలుగా అప్పుడప్పుడు కథలు పంపించడం తప్పించి, పోటీకి పంపడం అతడికి అలవాటులేదు. మొదటిసారి పంపిం చడం, ప్రైజు రావడం ఆనందంగా ఉంది. రాజారాంబలవన్మరణం అతనిలోగాఢముద్రవేసు కుంది.మధ్యతరగతిసంసారులు ఏ పరిస్థితులలో జూదం ఆడతారో, ఆ తరువాత ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబం గతి ఏమవుతుందో అనేది ఆవేశంగా చర్చించాడు. అందులో ఆకథ అడుగున, "జూదంలో నెలజీతం పోయిందనే బాధతో అమూల్యమైన జీవితాన్ని చేజేతులా తుదముట్టించుకున్న అమాయకుడు, నా స్నేహితుడు రాజారాంకి అంకితం" అని వ్రాశాడు. అయితే ఆకథకి ప్రైజ్ వస్తుం దని మాత్రం అతను ఆశలు పెట్టుకోలేదు.

ఆ శుభవార్త ఆరోజే సీతకి, మిత్రులకి,

డా. పి.వి.కె. రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ – వైద్యాచార్య
హస్తప్రయోగం, నరముల బల హీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్ఖలనము, శుక్లనష్టము, సుఖరోగములకు, మానసిక వ్యాధులకు శాస్త్రీయ చికిత్స, పోస్టుద్వారాకూడా చికిత్సగలదు.

రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి ఫోన్ : 700

శ్రీ వేంకటేశ్వర పబ్లికేషన్సు
ఏలూరు – 2.

మా ప్రచురణలు

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి
1) భోగి మంటలు నవల రు. 8/–
2) ప్రేమాయణం జ్యోతి మాస పత్రిక సీరియల్ నవల రు. 6/–
3) సందులోమందారం కథానికలు రు. 6/–
శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి
గాజువేడ రు. 9/–
ఆంధ్ర సచిత్ర వార పత్రిక సీరియల్ నవల
రు. 29/–లు ముందుగా పంపినవారికి పోస్టేజి ఉచితం.
వి. పి. పద్ధతి లేదు.

మీకు సంతానం లేదా ?



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణు లనేకులు మా సలహాలచే సంతాన వంతులయి యిచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు.

ఉచిత వివరములకు
శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తెనాలి – 2.


# విధాయకం

బంధువులకి వ్రాసిపారేసి, ఫస్ట్ షో సినిమా రిజర్వ్‌డ్ క్లాసులో కూర్చుని చూశాడు సుదర్శనం.

* * *

బహుమతి తాలూకు చెక్కు తీసుకుంటున్నప్పుడు అతనికి తన జీవిత భాగస్వామి పక్కనే లేకపోవడం ఎంతో లోటుగా కన్పించింది. ఆరోజు సాయంత్రం అంతా పార్కులో కూర్చుని బహుమతి మొత్తాన్ని ఏవిధంగా వినియోగించాలా అని ఆలోచిస్తూ చీకటిపడే వేళకి ఓ నిర్ణయానికి వచ్చాడు. సీత మెడ, చేతులు మరీ బోసిగా ఉన్నాయి. ఓ మంచి గొలుసూ, రెండు జతల గాజులు చేయిస్తే సంతోషిస్తుంది.'

ఇంటికి వచ్చేసరికి సాయంత్రం పోస్ట్‌లో సీత దగ్గిర నుంచి పుత్తరం వచ్చివుంది.

శ్రీవారికి,

మీరేమో తొందరగా వచ్చేయమని వ్రాస్తారు. కానీ మావాళ్లు మాత్రం "వెళుదువుగానీలే!" అంటూ వాయిదాలు వేస్తున్నారు. నాకు మాత్రం మిమ్మల్ని చూడాలని తహతహ లేదనుకుంటున్నారేమిటి? అన్నట్టు యిక్కడ మా వాళ్లందరికీ రాజారాం కథ చాలా నచ్చింది. ఫస్ట్ ప్రైజ్ వచ్చిన కథ కంటే యిదే బావుందన్నారు. నేను వచ్చే లోపల మీరు మీ మీసాలు తీసేయాలండోయ్! మీ ముద్దుల కొడుక్కి అవంటే చచ్చేంత భయం. మొన్న మీ మిలటరీ బావయ్య వస్తే ఆ మీసాలు చూసి ఒకటే ఏడుపు. మా అమ్మ వాళ్లు ఈ నెలాఖరున వెళ్లమంటున్నారు. ఏది ఏమైనా మరో పదిహేను రోజులల్లో మీ సన్నిధిన వుంటాను.

మీ ఆరోగ్యం జాగ్రత్త.

మీ, సీత

ఉత్తరం చదివి సుదర్శనం నవ్వుకున్నాడు. భోజనంచేసి బాబుని గురించి, సీతను గురించి ఆలోచిస్తూ పడుకున్నాడు.

అర్ధరాత్రివేళ ఎవరో తలుపు దబదబా బాదారు. సుదర్శనం కళ్లు నులుముకుంటూ లేచి వెళ్లి, లైటు వేసి తలుపు తెరిచాడు. బయట హోరున గాలి— భోరున వర్షం. వుండుండి కళ్లు జిగేల్ మనిపిస్తూ మెరుపులు.

గుమ్మంలో నిలబడివున్న మనిషిని చూసి సుదర్శనం కొయ్యబారిపోయాడు. అంత వర్షంలోను అతడి మొహం అంతా చెమట పట్టేసింది.

గుమ్మంలో రాజారాం నిలబడి వున్నాడు! తెల్ల లాల్చీ, పైజామా.

"నేను జ్ఞాపకం వున్నానా మాష్టారూ!" మునుపటి నవ్వు మొహంతోనే లోపలికి వచ్చాడు.

సుదర్శనం అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేశాడు. "మీరు నా కథ వ్రాసి చాలా మంచిపని చేశారు మాష్టారు! నా స్థితిలో వున్న మరెవ్వడూ నాలా తెలివితక్కువ పని చేయడు" సుదర్శనం ఒక్కొక్క అడుగు వెనక్కు వేస్తూంటే, రాజారాం అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు వస్తున్నాడు.

ఇద్దరు పడక గదిలో కొచ్చారు.

"ఆ కథకి "అడ్డదారి" అని పేరుపెట్టి నాకు అంకితం ఇచ్చారు కదూ" అవునన్నట్లుగా తల వూపాడు సుదర్శనం.

"ఆ కథ తాలూకు డబ్బు ఏ విధంగా ఖర్చు చేయాలన్నదే కదూ మీ సమస్య" సుదర్శనం మొహంలోకి గుచ్చి చూస్తూ అడిగాడు రాజారాం.

"మాష్టారూ, ఓ విషయం ఆలోచించండి. అది నా కథ—పైగా నాకు అంకితం ఇచ్చిన కథ. అటువంటప్పుడు దాని తాలూకు ప్రతిఫలం అంతా మీరే వాడేసుకోవడం అన్యాయం కదూ! దాంట్లో కొంత మా వాళ్ల కిస్తే, మా వాళ్ల స్థితి కొంచెం బాగుపడుతుంది కదా! ఆలోచించండి. న్యాయం మీరే ఆలోచించండి" గిరుక్కున వెను తిరిగి, చర చర నడిచి వెళ్లిపోయాడు రాజారాం, తలుపులు తెరుచుకుని గాఢాంధ కారంలోకి, ధారగా కురుస్తున్న వర్షంలోకి.

" రాజారాం, ఆగు " వెనకే అరుస్తూ పరిగెత్తాడు సుదర్శనం.

అతడు గుమ్మాన్ని చేరగానే తెరుచుకుని ఉన్న తలుపులు, ధడేల్‌మని మూసుకున్నాయి. "అబ్బా" అంటూ నుదురు గట్టిగా పట్టుకున్నాడు.

సుదర్శనానికి మెలుకువ వచ్చేసింది.

ఒళ్లంతా చమట పట్టేసి వుంది.

గొంతు తడారిపోయి వుంది.

అప్పటిదాకా జరిగింది కల అయినా, నిజంగా జరిగినట్టే అనిపించింది.

లేచి గాజు గ్లాసుడు నీళ్లు తాగి, మళ్లీ పడుకున్నాడు.

## విధాయకం

మరి నిద్ర దేవత అతని దాపులోకి రాలేదు.

* * *

"ఇదేమిటి, ప్రైజు డబ్బు ఏదిహేను వందలు కదా! ఏడొందలే చేతిలో పెట్టారేమిటి?" గాజులు చేయించుకోమని భర్త తన చేతిలో పెట్టిన ఏడు పచ్చ కాగితాలని మళ్ళీ మళ్ళీ లెక్కబెడుతూ ఆశ్చర్యంగా అడిగింది సీత.

"మిగతా ఎనిమిదొందలు పెట్టి రాజారాం పెద్ద కొడుకులో చిన్న కిళ్లీకొట్టు తెరిపించాను. వాళ్లకి కొంచెం ఆసరాగా వుంటుందని ప్రైజు డబ్బుల్లో వాళ్లకి సగం ఇవ్వడం విధాయకమే కదా!" వీధిలోకి వెళ్లిపోతున్న భర్త వైపు ఏ సంగతీ సరిగ్గా అర్థంగాక, గుడ్లప్పగించి చూస్తూ నిలబడి పోయింది సీత.



సాలోఫేన్—అమోఘమగు నిరపాయకరమైన నొప్పుల నివారిణి

SAA/AMS/1999 TEL

అమృతాంజన్ లిమిటెడ్‌వారి నమ్మకమైన తయారీ